WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లాబ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
**9492580091**

facbook.vaaradhinews.com

# వారధి

తెలుగు దిన పత్రిక

www.vaaradhinews.com

సంపుటి:1
సంచిక:7
మంగళవారం,
10.09.2024

# ఉప ఎన్నికలు పక్కా..!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై హైకోర్టు కీలక తీర్పు
- నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి
- లేదంటే మేమే సుమోటోగా తీసుకుని విచారిస్తాం
- స్పీకర్ కార్యాలయానికి న్యాయమూర్తి ఆదేశాలు
- కాంగ్రెస్ పార్టీకి తీర్పు చెంపపెట్టు లాంటిది
- పార్టీ ఫిరాయింపు అంటే ప్రజలను మోసం చేయడమే
- ఆ ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఒక్కో ఎమ్మెల్యేను రూ.100 కోట్లు పెట్టి కొన్నారు
- ఉప ఎన్నికల్లో దానం నాగేందర్‌ను ఓడిస్తాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



*"పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతలపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయానికి హైకోర్టు ఆదేశాలిచ్చింది. లేదంటే తామే సుమోటో కేసుగా తీసుకుని విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టిన హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై చట్టప్రకారం అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.*

**వారధి, స్టేట్ బ్యూరో:**

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సైతం పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన వారిపై మూడు నెలల్లో అనర్హత వేటు వేయాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయని, అయినా స్పీకర్ పట్టించుకోవట్లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వెల్లడించారు. స్పీకర్‌ను ఆదేశించే అధికారం హైకోర్టుకు లేదని, స్పీకర్ ఇండిపెండెంట్ ట్రైబ్యునల్ అని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గత నెల విచారణను ముగించిన హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఈ మేరకు 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయ కార్యదర్శికి ఆదేశాలిస్తూ ఇవాళ తీర్పు వెల్లడించింది.

**వారిని చూస్తే జాలేస్తోంది: కేటీఆర్**

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఓ వైపు పార్టీ ఫిరాయింపుల విషయంలో కఠినమైన చట్టం తెస్తామంటూ ఎన్నికల సందర్భంగా మాటిచ్చి, ఆ తర్వాత పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టులాంటి తీర్పని అన్నారు. మొదట్నుంచీ చెబుతున్నట్లే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు చాలా సీరియస్‌గా ఉందన్న కేటీఆర్, ఒక పార్టీ గుర్తు మీద గెలిచి మరొక పార్టీలోకి వెళ్లటం నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడమేనని వ్యాఖ్యానించారు. అదే విషయాన్ని కోర్టులు కూడా స్పష్టం చేశాయని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, అయినప్పటికీ సభాపతి సుప్రీంకోర్టు తీర్పును కూడా లెక్కచేయకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మి అడ్డంగా మోసపోయిన పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన

2లో



# మంకీ పాక్స్ తొలి కేసు..

- అనుమానిత లక్షణాలున్న వ్యక్తికి పాజిటివ్‌గా నిర్ధారణ
- వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 వైరస్‌గా గుర్తింపు
- కేంద్ర ఆరోగ్య శాఖ కీలక ప్రకటన
- ఎలాంటి ఆందోళన అవసరం లేదని సూచన
- రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు
- అనుమానితులకు టెస్టులు చేయాలని సూచన

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**

కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను ఇప్పటికీ భయపెడుతుండగా.. తాజాగా మరో వైరస్ మానవాళిని తీవ్రంగా వణికిస్తోంది. ఆఫ్రికా, యూరప్ దేశాల్లో వ్యాప్తి చెందుతున్న మంకీపాక్స్ వైరస్.. ఇప్పుడు భారత్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. భారత్‌లో మొదటి ఎంపాక్స్ కేసు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. ఇటీవల మంకీపాక్స్ వైరస్ అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలినట్లు వెల్లడించింది. గతంలో భారత్‌లో నమోదైన మంకీపాక్స్ వైరస్ వేరియంట్ కంటే ఈసారి సోకిన వేరియంట్ అంత ప్రమాదకరం కాదని.. దీంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇటీవల ఓ వ్యక్తి ఆఫ్రికన్ దేశం నుంచి భారత్‌కు రాగా.. అతడిలో మంకీపాక్స్ తరహా లక్షణాలు కనిపించాయి. దీంతో అతడిని ఐసోలేషన్‌కు తరలించిన అధికారులు.. రక్త నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించారు. తాజాగా ఆ ఫలితాల్లో అతడికి ఎంపాక్స్ సోకినట్లు తెలిపారు. బాధితుడికి వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 ఎంపాక్స్ వైరస్ ఉన్నట్లు గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అయితే ఈ ఏడాది దేశంలో

2లో



# రైతులు ఆందోళన చెందొద్దు

- మీకు అండగా నేనుంటా
- నీట మునిగిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వారధి న్యూస్, వనపర్తి :**

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూర్ గోపాల సముద్రం పూర్తిగా నిండడంతో బ్యాక్ వాటర్ తమ పంట పొలాలను ముంచేస్తుందని మండలంలోని మద్దిగట్ల గ్రామ రైతులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. రైతులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే.. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సోమవారం మద్దిగట్ల గ్రామ రైతులతో కలిసి నీటి మునిగిన భూములను పరిశీలించారు. ముంపునకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన చెరువు కట్ట నిర్మాణంలో అలుగును పెంచారని దాంతో తమ పొలాల్లోకి చెరువు నీరు చేరిందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిశీలించి తగు చర్యలు చేపట్టి.. రైతులకు సహకరించాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నకు రుణమాఫీ

- రూ.30 కోట్ల రుణాలు రద్దు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- ప్రకటించిన వెంటనే ఆదేశాలు జారీ
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రెండేసి చేనేత చీరలు
- కోటి 30 లక్షల చీరలు నేసే పని కల్పిస్తం
- ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు






**వారధి, స్టేట్ బ్యూరో:**

పాలనలో తనదైన మార్కు చూపిస్తూ సంచలన నిర్ణయాలతో దూసుకుపోతున్న సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతు రుణమాఫీ మాదిరిగానే నేతన్నలకు రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటించిన వెంటనే నేతన్నల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాదాపు రూ.30 కోట్ల రుణాలను రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్

2లో

## ముచ్చెర్లలో గ్రీన్ ఫార్మా సిటీ

2లో




# కేంద్రానికి సహకరించండి

- రైల్వే టెర్మినల్స్‌కు వెళ్లే రోడ్ల విస్తరణ చేపట్టండి
- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**వారధి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కేంద్రం చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించాలని అందులో కోరారు. తెలంగాణలో రైల్వేలు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం చేపడుతున్న చర్యలకు సహకారం ఉండాలని కోరారు. సికింద్రాబాద్

2లో



# పసుపు ప్యాకెట్లలో గంజాయి సరఫరా

- అడ్డంగా దొరికిపోయిన మహిళ
- కేసు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు

**వారధి న్యూస్, హైదరాబాద్:**

డ్రగ్స్, గంజాయిపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం తెలంగాణ పోలీస్ ఫోకస్ పెంచింది. ముఖ్యంగా గంజాయి ఎక్కడ పట్టుబడిన.. దాని మూలాలు ధూల్‌పేట్‌కు కనెక్ట్ అవుతుండడంతో ఆ పరిధిలో అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. గంజాయిని అంతం చేయడమే

2లో



# అధికారుల్లో 'హైడ్రా' వణుకు

## పలువురిపై కేసులు నమోదు
## ముందస్తు బెయిల్ పిటిషన్‌కు అప్పీల్

**వారధి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన అధికారులపై హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ప్రభుత్వ అధికారులపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత సందర్భంగా ఈ అక్రమ అనుమతుల వ్యవహారం వెలుగులోకి

2లో

# ప్రతి కుటుంబానికి రూ.16,500
# ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం

- ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు
- వెంటనే రూ.5 లక్షల నిధులు మంజూరు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం
- భారీ వర్షా లు, వరదలతో 33 మంది మృతి
- యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు
- తడిచిన దస్త్రాలపై ఫిర్యాదుకు ప్రత్యేక కౌంటర్లు
- వరద బాధితులకు సాయంపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇప్పటివరకు సుమారు 33 మంది చనిపోయారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఎంత నష్టం వాటిల్లిందన్న విషయంపై ఆరా తీశారు. నష్ట నివారణకు ఎన్ని నిధులు

2లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com





# మంకీ పాక్స్ తొలి కేసు..

**తరువాయిభాగం**

ఇప్పటివరకు ఒకటే మంకీపాక్స్ కేసు నమోదైందని తెలిపింది.

**భయపడాల్సిన పనిలేదన్న కేంద్రం**

ఇక భారత్‌లో తొలిసారి 2022లో 30కిపైగా మంకీపాక్స్ కేసులు వెలుగు చూశాయని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం నమోదైన వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 ఎంపాక్స్ వైరస్ రకం.. 2022లో నమోదైన కేసుల అంత ప్రమాదకారి కాదని తేల్చి చెప్పారు. దీంతో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ఎంపాక్స్ క్లాడ్ 1 ఆరోగ్య అత్యవసర స్థితికి సంబంధించిన వైరస్ కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరించింది. అయితే ఇప్పుడు వైరస్ సోకిన వ్యక్తి మంకీపాక్స్ కేసుల తీవ్రత ఎక్కువగా ఉన్న దేశం నుంచి ఇటీవల భారత్‌కు వచ్చినట్లు తెలిపింది. ప్రస్తుతం అతడిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని.. ఆరోగ్య సమస్యలు ఏమీ లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

**రాష్ట్రాలకు కీలక ఆదేశాలు**

మరోవైపు.. ప్రపంచవ్యాప్తంగా ఎంపాక్స్ కేసులు పెరుగుతున్న కొద్దీ కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం.. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైరల్ లక్షణాలు ఉన్నాయని అనుమానం వచ్చిన వ్యక్తులందరికీ స్క్రీనింగ్, టెస్టింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలని కేంద్రం సూచించింది. బాధితులకు చికిత్స అందించేందుకు ఐసోలేషన్ కేంద్రాలను సిద్ధం చేయడానికి ఆస్పత్రులను గుర్తించాలని రాష్ట్రాలను కోరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన వివరాల ప్రకారం.. 2022 జనవరి నుంచి 2024 ఆగస్టు మధ్య.. ప్రపంచంలోనే 120 దేశాల్లో మంకీపాక్స్ కేసులు వెలుగు చూశాయి. మొత్తం లక్షకుపైగా కేసులు నమోదు కాగా.. 220 మరణాలు సంభవించాయి.




# రాముడి ప్రాణ ప్రతిష్ట రోజే పేలుళ్లకు కుట్ర

- బీజేపీ ఆఫీసే ఉగ్రవాదుల టార్గెట్
- కుదరకపోవడంతో బెంగళూరు కేఫ్‌లో పేలుళ్లు
- రామేశ్వరం కేఫ్‌లో పేలుడుపై ఎన్ఐఏ ఛార్జ్‌షీట్

**వారధి న్యూస్, బెంగళూరు:**

బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు కేసులో నలుగురు నిందితులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం చార్జ్ షీట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా పలు ఆసక్తికర అంశాలను ఎన్ఐఏ తన ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించింది. ఈ ఏడాది జనవరి 22వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో అయోధ్యలోని రామాలయంలో బాలా రాముడి ప్రాణ ప్రతిష్ట జరిగింది. ఈ నేపథ్యంలో అదే రోజు.. బెంగళూరులో మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయం పేల్చివేతకు ఈ నిందితులు కుట్ర పన్నారని పేర్కొంది. కానీ ఆ ప్రయత్నం విఫలమైందని తెలిపింది. దీంతో బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేల్చాలని వీరు నిర్ణయించారని వివరించింది. అలాగే ఈ పేలుడుకు పాల్పడిన నిందితులు కర్ణాటకలోని శివమొగ జిల్లాకు చెందిన ముస్సావీర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహాలకు ఏ రూపంలో నగదు అందింది... అదే విధంగా వీరు పాల్పడిన హింసాత్మక ఘటనలను సైతం ఈ సందర్భంగా తన ఛార్జ్ షీట్‌లో ఎన్ఐఏ పొందుపరిచింది. యువతలో సిరియాకు చెందిన ఐసిస్ ఉగ్రవాద భావజాలం నింపేందుకు వీరు వ్యవహరించారని స్పష్టం చేసింది.

# ముచ్చెర్లలో గ్రీన్ ఫార్మా సిటీ

- కాలుష్య రహితంగా ఉండేలా చర్యలు
- మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ శివార్లలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పర్యావరణ హితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

**వేగంగా పనులు జరగాలి...**

అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీలు, తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ & లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

**పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యం**

యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యముంటుందని చెప్పారు. వీటితో పాటు పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని అన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) శ్రీనివాసరాజు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శషాంక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఉప ఎన్నికలు పక్కా..!

**తరువాయిభాగం**

ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తోందని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఊసరవెల్లి కూడా రాహుల్ గాంధీని చూసి సిగ్గుపడుతుందన్న ఆయన, ఓ వైపు రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలు గాలికి వదిలి, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి అటు న్యాయస్థానంలోనూ, ఇటు ప్రజాక్షేత్రంలోనూ గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. వచ్చే ఉపఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ బుద్ధి చెబుతారని అన్నారు.

**ఆ ఎమ్మెల్యేలపై వేటు పక్కా: హరీష్‌రావు**


హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమని హరీశ్‌రావు పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఉందని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని తెలిపారు.

**రాహుల్ గాంధీ స్పందించాలి: మాజీ మంత్రి సింగిరెడ్డి**

ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. నెలన్నర క్రితమే ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి లేఖ రాసినా చలనం లేదని విమర్శించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా రాహుల్ స్పందించాలని డిమాండ్ చేశారు. నైతికత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై రాహుల్ అనర్హత వేటు వేయించాలని సవాల్ విసిరారు. ఎన్ని రోజులకైనా కోర్టు తీర్పులను తప్పించుకోజాలరని, ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తాము విలువలకు పట్టం కడుతున్నామని ఎందుకు చెప్పడం లేదని ఓ ప్రకటనలో నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. రాజ్యాంగం మీద నమ్మకం ఉంటే, చెప్పే మాటల్లో చిత్తశుద్ధి ఉంటే రాహుల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాహుల్ మాటలు, చేతలు ద్వంద్వ విధానంగా భావించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

**ఒక్కో ఎమ్మెల్యేకు రూ.100 కోట్లు: పాడి కౌశిక్ రెడ్డి**

10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ.1000 కోట్లు



పెట్టి కొన్నారని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 100 కోట్లు ఇచ్చి కాంగ్రెస్‌లో జాయిన్ చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలో త్వరలో ఉపఎన్నికలు వస్తాయని..

స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఉపఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. దానం నాగేందర్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తామని.. ఒకే ఒక్క నెలలో హైదరాబాద్ రోడ్లమీద ఉరికిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు.




# నేతన్నకు రుణమాఫీ

**తరువాయిభాగం**

నాంపల్లి లలితా కళాతోరణంలో ఐఐహెచ్‌టీని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐహెచ్‌టీని ప్రారంభించడం సంతోషకరమని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. తెలంగాణకు చెందిన విద్యార్థులు ఏపీ, ఒడిశాకు వెళ్లి హ్యాండ్లూమ్ కోర్సులు చదవాల్సి వస్తోందన్న రేవంత్ రెడ్డి.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడి ఐఐహెచ్‌టీకి అనుమతులు తీసుకొచ్చుకున్నామని తెలిపారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదని.. తెలుగు యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచే ఐఐహెచ్‌టీ తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఐఐహెచ్‌టీని స్కిల్ యూనివర్సిటీకి తరలిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కోర్సు చేసే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు 2500 స్టైఫండ్ ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు..**

చేనేతల సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడు ముందు ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలోని నేతన్నలతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని వివరించారు. నేతన్న కొండా లక్ష్మణ్ బాపూజీ తన పదవిని తృణప్రాయంగా త్యాగం చేశారని గుర్తు చేశారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరును.. ఐఐహెచ్‌టీకి పెట్టాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. చేనేత కార్మికులకు పని కల్పించేందుకు రాష్ట్రంలోని స్వయం సహాయ సంఘాల్లోని 63 లక్షల మంది మహిళలకు ఏటా రెండేసి చేనేత చీరలను ఇవ్వనుందని చెప్పారు. త్వరలోనే పనులు అప్పగిస్తామని సీఎం చెప్పారు. గత ప్రభుత్వం చేనేతల విషయంలో ప్రచార ఆర్భాటం తప్ప చేసిందేమీ లేదని అన్నారు. సినీ తళుకు బెళుకులతో ఆర్భాటం చేసినా చేనేత కార్మికుల జీవితాల్లో మార్పులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంఘాలను వీలైనంత త్వరగా నిర్వహించాలని అధికారులను ఈ వేదిక నుంచే ఆదేశిస్తున్నట్టు సీఎం తెలిపారు. ప్రజా ప్రభుత్వం కులవృత్తులకు సముచిత గౌరవం ఇస్తుందని అన్నారు.. రైతన్న అన్నం పెడితే... నేతన్న ఆత్మగౌరవం ఇస్తారని సీఎం అన్నారు. రైతన్న ఎంత ముఖ్యమో.. నేతన్న కూడా అంతే ముఖ్యమని, నేతన్నల సమస్యలు పరిష్కరించేందుకు మీకు అందుబాటులో ఉంటానని సీఎం చెప్పారు.

# ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం

**తరువాయిభాగం**

అవసరం ఉందన్న అంశాలపై పకడ్బందీగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి పంపాల్సిన నివేదికలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వరద ప్రాంతాలలో ఎన్యుమరేషన్ కూడా పక్కాగా జరగాలని సూచించారు. శాఖల పరంగా జరిగిన నష్టాన్ని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రతిపాదికన బాధితులకు సాయం అందించాలన్నారు. బాధితులకు ఈ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి బాధితుడిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు**

భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, 33 జిల్లాలను వర్ష ప్రభావిత జిల్లాలుగా ప్రకటించామన్నారు. భారీ వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 33 మంది మృతి చెందారని, ఇందులో ప్రధానంగా ఖమ్మంలో ఆరుగురు, కొత్తగూడెంలో ఐదుగురు, ములుగులో నలుగురు, కామారెడ్డిలో ముగ్గురు, వనపర్తిలో ముగ్గురు చనిపోయారని అధికారులు వివరించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని కూడా అందచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు**

ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఇండ్లు పూర్తిగా, కొన్ని పాక్షికంగా కూలిపోయాయి. వీటిని వెంటనే గుర్తించి బాధితులకు రూ.5 లక్షలతో ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

**ప్రతి కుటుంబానికి రూ.16,500**

వర్షాలలో దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.16,500 చొప్పున సాయం అందిస్తున్నామని మంత్రి చెప్పారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా వరద సాయం పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే బాధితుల అకౌంట్లలో జమ చేస్తున్నామన్నారు. వరద సమయంలో సీఎం వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించినప్పుడు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారని, అయితే, జరిగిన నష్టాన్ని చూసి మానవతా దృక్పథంతో రూ.16,500కి పెంచినట్లు తెలిపారు. ఈ సాయాన్ని నేటి నుంచి బాధితులకు అందజేస్తామన్నారు.

**ఎకరానికి రూ.10 వేలు**

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం లక్షలాది ఎకరాల పంట నష్టం వాటిల్లింది. వరద ముప్పుకు గురైన ప్రతి ఎకరానికి రూ.పది వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 358 గ్రామాలు వరద ముప్పునకు గురికాగా, దాదాపు 2 లక్షల మంది ప్రభావితం అయినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం 158 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముందస్తు చర్యల వల్ల 2,454 మందిని రక్షించామని తెలిపారు. 13,494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వివరించారు.

**యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు**

భారీ వర్షాలు, వరదలతో ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ విభాగాలకు సంబంధించి వేలాది కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కొన్ని రోడ్లను పునరుద్ధరించామని, శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రెండు మూడు రోజుల్లో తయారుచేయాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. అలాగే మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన మరమ్మతులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరమ్మతులతో ఆశించిన ప్రయోజనం ఉండకపోవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు

**తడిచిన దస్త్రాల ఫిర్యాదుకు ప్రత్యేక కౌంటర్లు**

భారీ వర్షాలు, వరదలకు చాలా ఇండ్లల్లోకి నీరు చేరి ఇంటి యజమాని భూ పత్రాలు, ఆస్తి పత్రాలు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డులతో పాటు విలువైన పత్రాలు తడిచిపోయాయి, కొట్టుకుపోయాయి. ఈ బాధితులందరూ స్థానికంగా ఉన్న పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఆ డూప్లికేట్ పత్రాలను అందిస్తారని ఈ విషయంలో బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి భరోసా ఇచ్చారు.

# కేంద్రానికి సహకరించండి

**తరువాయిభాగం**

రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వే టెర్మినల్స్‌కు వెళ్లే రోడ్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించి పదేళ్లుగా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధి మిషన్ మోడ్‌లో పూర్తవుతోందని పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తో పాటు లైన్ల ఎలెక్ట్రిఫికేషన్ పనులు, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లలోని రద్దీని దృష్టిలో పెట్టుకొని చర్లపల్లిలో రూ.415 కోట్లతో రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తైతే పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ.715 కోట్లతో అంత




ర్జాతీయ విమానాశ్రయం స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి అత్యాధునిక వసతులతో దీన్ని ప్రజలకు అంకితం చేయనున్నామన్నారు. రేతిఫైల్, ఆల్ఫా హోటల్ వద్ద రోడ్లు ఇరుకుగా ఉండి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయమై చొరవ చూపాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.



# పసుపు ప్యాకెట్లలో గంజాయి సరఫరా

**తరువాయిభాగం**

లక్ష్యంగా ఆపరేషన్ ధూల్‌పేట్ నిర్విరామంగా కొనసాగుతోంది. దీంతో నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొందరు పసుపు ప్యాకెట్లలో గంజాయి పెట్టి విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేటకు చెందిన నేహా బాయి అనే మహిళ పసుపు ప్యాకెట్లు తయారీ కేంద్రాన్ని పెట్టుకుంది. అయితే, పసుపు ప్యాకెట్లలో పసుపు కాకుండా గంజాయి పెట్టి అమ్ముతోంది. దీనిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు సమాచారం అందడంతో నిఘా పెట్టి దాడి చేసింది. దీంతో ఆ మహిళా అధికారులకు దొరికిపోయింది. అట్లాస్ టర్మరిక్ పౌడర్ పేరుతో ఉన్న ఆ ప్యాకెట్లను అధికారులు విప్పి చూడగా అందులో గంజాయిని చూసి అధికారులు షాక్ అయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డీఎస్పీ తిరుపతి యాదవ్, ఎస్సై నాగరాజుతో పాటు సిబ్బంది కలిసి ఈ దాడి చేశారు. 10 గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, నేహా బాయిని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# అధికారుల్లో 'హైడ్రా' వణుకు

**తరువాయిభాగం**

వచ్చిన సంగతి తెలిసిందే. హైడ్రా ఫిర్యాదు మేరకు సోమవారం అధికారులపై సైబరాబాద్ ఆర్థిక విభాగం పోలీసులు కేసులు నమోదు చేశారు. చందానగర్, బాచుపల్లిలోని గవర్నమెంట్ ఉద్యోగులపై ఈమేరకు చర్యలు తీసుకున్నారు.మరోవైపు కేసుల నమోదుతో ప్రభుత్వ అధికారులు తాజాగా ముందస్తు బెయిల్ పిటిషన్‌కు అప్పీల్ చేశారు. వీరిలో బాచుపల్లి తహసీల్దార్ పూల్ సింగ్, లాండ్ అండ్ రికార్డ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్ ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ఈక్రమంలో గవర్నమెంట్ అధికారులకు బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును ఆర్థిక విభాగం పోలీసులు కోరారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com





# అలుపెరుగని పోరాట యోధుడు

- నవ తరం జర్నలిస్టులకు మార్గదర్శి
- అంటరానితనం నిర్మూలనలో ఆయన కృషి అద్వితీయం
- నిత్యం సమాజ సేవే ధ్యేయంగా పయనం
- ఘనంగా జర్నలిస్ట్ నాయకుడు గుడిపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన పలువురు జర్నలిస్టులు

**వారధి న్యూస్, షాద్ నగర్ :**

తనను నమ్మిన వారి పాలిట బ్రహ్మాస్త్రంగా, అవినీతి పరులపై ప్రయోగించే పాశుపతస్త్రంగా, జర్నలిస్టు సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్ (పేపర్ శ్రీనన్న). సోమవారం ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, నియోజకవర్గ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు గత 3 దశాబ్దాలకు పైగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ మండల స్థాయి జర్నలిస్టు నుండి మహబూబ్ నగర్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షునిగా పలుమార్లు ఎన్నికై తన మార్కును చూపించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడిగానే కాకుండా తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగుతూ పాత తరం జర్నలిస్టులకు దిక్సూచిగా కొత్త తరం జర్నలిస్టులకు మార్గదర్శిగా ఆయన జీవితం జర్నలిస్టుల సంక్షేమానికే అంకితం. నేటి సమాజంలో ఒక రాజకీయ నాయకుడికి కార్యకర్తల రూపంలో అభిమానులు ఉండటం సర్వసాధారణం. కానీ ఒక జర్నలిస్ట్ నాయకుడికి ఊరూరా పేపర్ శ్రీనన్న అభిమాన సంఘం పేరుతో అభిమానులు ఉండడం మామూలు విషయం కాదు. ఆయన పనితీరుకు నిదర్శనం ఈ అభిమాన సంఘాలు. ఈ అభిమాన సంఘాలు ఏర్పడడానికి ఆయన చేసిన కృషే కారణం.

**అంటరానితనం నిర్మూలనకు కృషి**

30 ఏళ్ల క్రితం అంటరానితనాన్ని నిర్మూలించడానికి, దళితులను ఆలయ ప్రవేశాలు చేయించడంలో ఆయన చేసిన కృషి అద్వితీయం. అంటరానితనాన్ని నిర్మూలించడానికి ఏ మూల ఏ సంఘటన జరిగినా వార్తల రూపంలో వెలికితీస్తూ ఎప్పటికప్పుడు దళితులను చైతన్యపరిచిన శ్రామికుడతను. అన్న అంటూ సాయం కోరి వచ్చిన వారికి ఆర్థిక సాయం చేస్తూ, అవసరమైన చోట బోరుబావులను సైతం వేయించి దప్పిక తీర్చిన గొప్ప వ్యక్తి. కొన్ని గ్రామాల్లో బస్సు షెల్టర్‌లను సైతం ఏర్పాటు చేయించారు. నేటి తరం యువత పెడదారిన పడకుండా పదిమందికి ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో పరిశ్రమల్లో వారి చదువులకు తగ్గ ఉద్యోగాలు ఇప్పిస్తూ ముందుకు నడిపించారు. అలాగే జర్నలిస్టు సమస్యలపై నాడు, నేడు అలుపెరుగని పోరాటం చేస్తున్న జర్నలిస్టు నాయకుడు అతను. తోటి జర్నలిస్టుల సమస్యలే తన సమస్యలుగా భావించి వారికి ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులను, ఇండ్ల స్థలాల మంజూరుకు తనదైన శైలిలో పోరాటం చేస్తున్నారు. ఆయన అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ జర్నలిస్టుల పక్షమే. ఇప్పుడున్న చాలామంది జర్నలిస్టులు ఒక స్థాయిలో ఉన్నారంటే అది ఆయన చలవే అని అంటుంటారు కొందరు. నేటితరం జర్నలిస్టులకు ఆయన ఒక మార్గ నిర్దేశకుడు.

# గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయండి

- ఆర్ఎంపీల నిరసన

**వారధి న్యూస్, ములుగు:** గ్రామీణ వైద్యులపై టిఎస్ఎంసి మరియు ఐఎంఏ అధికారులు జరుపుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం జిల్లాలోని అన్ని మండలాల ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు పెద్ద సంఖ్యలో భాగంగా నిరసనకు దిగారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ నుండి ర్యాలీగా ప్రారంభించిన వైద్యులు, టిఎస్ఎంసి మరియు ఐఎంఏ అధికారుల చర్యలను నిలిపివేయాలని, గ్రామీణ వైద్యుల ఐక్యతను పెంచాలని నినాదాలు చేస్తూ కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టర్ టీఎస్ దివాకర్ అందుబాటులో లేకపోవడంతో, అదనపు కలెక్టర్ మహేందర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీలు పాతకాలం నుండి వైద్య సేవలు అందిస్తున్నారని, గ్రామీణ వైద్యులు రాత్రి, పగలు తేడా లేకుండా




సేవలందిస్తున్నారని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామీణ వైద్యులందర్నీ తప్పుగా నిందించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. సంక్షేమానికి, వైద్య సేవలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే విధంగా అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా నాయకులు, మాజీ సీఎం రాజశేఖర రెడ్డి కాలంలో శిక్షణ ఇచ్చి ప్రభుత్వ కార్యక్రమం నిలిచిపోయిందని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో భాగంగా, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, ఆర్ఎంపి, పిఎంపీలు పాల్గొన్నారు.

**ప్రధాన పాయింట్లు:**

మూడో రోజు నిరసన: గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా నాయకులు తమ వైద్య సేవలను మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు ప్రకటించారు.

**ప్రభుత్వ వైపు స్పందన:** ప్రభుత్వం వైద్యులకు శిక్షణ మరియు సర్టిఫికెట్ అందించడంలో సహకరించాలని వారు కోరారు.



# శౌర్య యాత్రను విజయవంతం చేయండి

- సిపిఎం పిలుపు

**వారధి న్యూస్, సిద్దిపేట:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా, ఈనెల 14 న బైరాన్ పల్లి లో జరిగే శౌర్య యాత్ర మరియు సంస్మరణ సభను, చేర్యాల నుండి బైరాన్ పల్లి బురుజు వరకు బైకు ర్యాలీని విజయవంతం చేయాలని *సిపిఎం* పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.సోమవారం, ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్ర్యపట్ల, స్వేచ్ఛకు, భూమి హక్కులకు సంబంధించిన పోరాటం, వెట్టి చాకిరి నుండి విముక్తి, మరియు నిరంకుశ భూస్వామ్య దోపిడీ వ్యతిరేక పోరాటం గురించి వివరించారు. ఈ శౌర్య యాత్ర, నాటి సాయుధ పోరాట యోధులకు నివాళి అర్పించడానికి, నాటి చరిత్రను వక్రీకరించే నేటి పాలకులకు బుద్ధి చెప్పడానికి జరగనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండ కింది అరుణ్ కుమార్, పార్టీ నాయకులు గొర్రె శ్రీనివాస్, దర్శనం రమేష్, రాళ్ల బండి భాస్కర్, బోయిన మల్లేశం, పండుగ యాదగిరి, యాడారం బ్రహ్మయ్య, బావండ్ల పల్లి రమ తదితరులు పాల్గొనాలన్నారు. సభ్యులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, నాటి పోరాట యోధుల కుటుంబాల వారసులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# అగ్రగామి దేశంగా నిలపాలంటే బీజేపీలో చేరండి

- సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పిలుపు

**వారధి న్యూస్,మంచిర్యాల జిల్లా :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో అధికారికంగా ప్రారంభించిన సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు, భారతదేశాన్ని అగ్రగామి దేశంగా నిలపాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, దేశాన్ని విశ్వగురువు స్థాయిలో నిలబెట్టేందుకు కేవలం బీజేపీనే సరైన మార్గం అని డా. హరీష్ బాబు అభిప్రాయపడ్డారు. ప్రజలు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు ద్వారా బీజేపీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతోందని, ఈ అభివృద్ధి యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ మాత్రమే జాతీయవాద భావాలను కలిగిన పార్టీ అని, మిగతా పార్టీలన్నీ కుహనా జాతీయవాద పార్టీలని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, సభ్యత్వ నమోదు ప్రభారి ఆకుల విజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, సీనియర్ నాయకులు ఆరుముళ్ళ పోశం, సీనియర్ అడ్వకేట్ కర్రె లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం

*ఆమె ఎత్తు కేవలం మూడడుగులే..అయితేనేం వెండితెర మీద వందకు పైగా సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేకతను నిలుపుకున్నారు పొట్టి విజయదుర్గ. విఠలాచార్య సినిమా అంటే చాలు వీరయ్య ఉండాల్సిందే. అలా మొదలు నాలుగు వందలకు పైగా సినిమాల్లో నటించి మెప్పించిన అరుదైన నటుడు పొట్టి వీరయ్య కూతురే ఈ విజయదుర్గ. తండ్రి పోలికలేకాదు. నట వారసత్వాన్ని పునికి పుచ్చుకుని చలన చిత్ర రంగంలోకి అడుగు పెట్టింది విజయ. తండ్రికి తగ్గ తనయగా ఎన్నో చిత్రాల్లో ప్రత్యేక పాత్రల్లో కనిపించి మెప్పించింది. కానీ ఇప్పుడు అవకాశాలిచ్చేవాళ్లులేక ఒక్కఛాన్స్ ఒకే ఒక్కఛాన్స్ అంటున్న విజయదుర్గ తన బాధను ఇలా పంచుకుంది.*







**అచ్చం నాన్నలాగే....**

నేను పుట్టింది మద్రాస్‌లోనే. ఒకనొక ఉదయాన మా అమ్మ మల్లికను రెండవ డెలివరీ కోసం దవాఖానలో చేర్పించారు. అందరిలోనూ ఒకటే టెన్షన్..అందులో నాన్నకు రెండింతల టెన్షన్...కారణం తను పొట్టిగా ఉండడం. తనలాగే పిల్లలు పుడుతారేమోననే భయం. మరోవైపు ఒకింత ధైర్యం. మా అక్క విమల అమ్మలాగ సాధారణంగానే జన్మించడంతో రెండవ బిడ్డ కూడా అలాగే పుడుతుందని. కానీ నేను పుట్టిన మరుక్షణం ఆయన నోట మాటరాలేదు. అవును నేను అచ్చం ఆయనలాగే పుట్టడంతో ఆయన చాలా బాధపడ్డారు. తను మగవారు ఎలాగోలా జీవితం సాగింది. కానీ నేను ఆడపిల్లను అని. అయినా ఆయన ఏమాత్రం కలత చెందలేదు. తనలాగే నాకూ ప్రత్యేక గుర్తింపు వస్తుందనే నమ్మకం ఆయనను సముదాయించింది.

**ఒకసారి వెనక్కి వెలితే,,,**

మా నాన్న పొట్టివీరయ్య తెలంగాణ బిడ్డ. మాది నల్లగొండ జిల్లా ఫణిగిరి గ్రామం. స్టేజీ ఆర్టిస్ట్ అయిన నాన్నఅందిలాగే సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. దర్శకుడు విఠలాచార్య దృష్టిలో పడడంతో ఆయన దశ తిరిగింది. అలా ఆయన తొలిసారి అగ్గిదొర చిత్రంలో నటించారు. అప్పటి నుంచి అయన కోసం ప్రత్యేక పాత్రలు సృష్టించిన దర్శకులు ఉన్నారంటే అతిశయోక్తికాదు. అలా ఆయన 400 లకు పైగా సినిమాలు, 100 ల వరకు టీవీ సీరియల్స్ చేశారు. అలాంటి వాతావరణంలో పెరగడంతో సహజంగానే నాకు సినిమా రంగం పట్ల ఆసక్తి ఏర్పడింది. అలా మొదట టీవీ సీరియల్స్‌లో నటించిన నేను తర్వాత రావుగారింట్లో రౌడీ సినిమాతో వెండితెర మీద అడుగుపెట్టిన.

**వరుసగా అవకాశాలు**

తెలుగు సినిమా రంగం హైదరాబాద్ కు వచ్చిన సమయంలోనే మా కుటుంబం కూడా హైదరాబాద్‌కు వచ్చింది. ఇక్కడికి వచ్చాక నాన్నతో పాటు నాకు కూడా పలు అవకాశాలు వచ్చాయి. అదే సమయంలో డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ శిక్షణ తీసుకుని పలువురు ఇతర భాషల క్యారెక్టర్లకు తన గొంతును అరువిచ్చాను. ఎన్నో సినిమాల్లో నాన్నతో పాటు పాత్రలను పంచుకున్నాను. సినిమాలు, సీరియల్స్ తో ఒకనొక దశలో బిజీ ఆర్టిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకున్నా. అదే సమయంలో స్టేజీ డాన్సర్‌గా కూడా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నాను.

**ప్రేమ వివాహం**


నేను సినిమాల్లో చేస్తున్న సమయంలోనే మల్లిఖార్జున్ అనే వ్యక్తి నన్ను ప్రేమిస్తున్నానని వచ్చాడు. మానాన్నకు ఆయనకు ఇవ్వడం ఇష్టం లేదు. కారణం నేను నాకు నేను ఏం చేసుకోలేను అని. అయినా వినకపోవడంతో ఒక దశలో నన్ను ఇంట్లో బంధించారు. కానీ ఆయన పట్టు విడవకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పెండ్లి చేశారు. అంటే నాది పెద్దలు చేసిన ప్రేమ పెండ్లన్న మాట.

**సోనుసూద్ ను కలిసి...**

**నా యు ట్యూబ్ చానెల్‌ను ఎవరితో ప్రారంభించానో తెలుసా? మానవత్వానికి మరో రూపంగా వెలుగొందుతున్న సోనుసూద్ గారితో. ఆయనను కలవగానే ఎంతో ఆప్యాయంగా పలకరించారు. నేను ఫలానా వీరయ్య గారి కూతురు అనగానే నా చానెల్‌ను సంతోషంగా ప్రమోట్ చేశారు. ఆయనను కలిసానని తెలియగానే చాలామంది నన్ను తిట్టారు. ఎందుకంటే ఆయనను కలిసి ఛానెల్ ను ప్రమోట్ చేసుకుంటారా? ఏదైనా సాయం అడగాలి అని. కానీ నా మనసు ఒప్పుకోలేదు. అందుకే నా కాళ్ల మీద నేను నిలబడడానికి ఈ చానెల్‌ను ప్రమోట్ చేయించుకున్న.**



**నాన్న ఒంటరయ్యాడు**



నా పెండ్లి తర్వాత అమ్మ మరణించడం నన్ను మా నాన్నను చాలా కుంగదీసింది. అప్పటికే నాన్నకు ఆరోగ్యం సహకరించకపోయేది. నేను ఆయనకు ఏం చేయలేని పరిస్థితి. అందుకే అక్కే అయనకు అన్నీ అయ్యింది. అమ్మకంటే బాగా నాన్నను అక్క కంటికి రెప్పలా కాపాడింది. కానీ ఆయన కూడా అనారోగ్యంతో పాటు హార్ట్‌స్ట్రోక్ ఈ మధ్యే మరణించారు. ఆయన మరణం నన్ను మరింత దెబ్బతీసింది. నాకు అమ్మ కంటే నాన్నంటనే ఎక్కువ ఇష్టం. నేను ఏం చేసినా ఆయన సమర్థించేవారు. నేనంటే అంత నమ్మకం ఆయనకు. ప్రతి విషయాన్ని ఆయనతో పంచుకునే దాన్ని కానీ కానీ ఇప్పుడు ఆయన లేరు. నాన్నతోపాటే చచ్చిపోవాలనిపించింది.

**ఆర్థిక ఇబ్బందులు**

మానాన్నకు ప్రభుత్వం గాజుల రామారంలో ఇంటి స్థలాన్నిఇస్తే..దాన్ని ఆయన నాకు ఇచ్చారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకుందామని మొదలు పెట్టాను. తెలిసిన వ్యక్తిని నమ్మి నా దగ్గర ఉన్న డబ్బులన్నీ ఇచ్చా. కానీ తను డబ్బులు తీసుకుని ఇంటి నిర్మాణం పూర్తి చేయలేదు. చేతిలో ఐదు పైసలు లేని సమయం. ఏం చేయాలో అర్థం కాలేదు. రెండు సంవత్సరాలు వచ్చిన చిన్న చిన్న అవకాశాలను ఉపయోగించుకుని ఆ డబ్బులతో ఇల్లు పూర్తి చేసుకున్న. ఇప్పటికీ ఆ డబ్బులు రాలేదు.

**కరోనా దెబ్బతో అన్నీ బంద్...**

అప్పుడప్పుడు వచ్చే అవకాశాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్ననాకు కరోనా రూపంలో మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. షూటింగులన్నీ నిలిచిపోవడంతో సినిమాలు, సీరియల్స్ లేక కుటుంబం గడవడం కష్టంగా మారింది. కొంతమంది దాతలు ఇచ్చిన సహకారంతో కాలం వెళ్లదీస్తున్న. ఇదే సమయంలోనే నాన్న మరణం నన్నుమరింత క్రుంగదీసింది. భర్త అనారోగ్యంతో ఏం చేయలేక, షూటింగ్‌లు అగిపోయి చేతిలో పనిలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న.

**ఒక్క అవకాశం ఇవ్వండి**

నేను ఎవరినుంచి ఆర్థిక సాయం కోరడం లేదు. అవకాశలు ఇవ్వమనే అడుగుతున్నాను. నేను గొప్ప ఆర్టిస్టును అనడం లేదు. కానీ చిన్నపాత్ర అయిన చేస్తా అంటున్న. అంతేకాదు స్టేజీ ప్రోగ్రామ్స్, ఈవెంట్స్ ఇలా ఎవైనా చేస్తా. మీ ఇంట్లో జరిగే బర్త్‌డే, పెండ్లి ఇలా ఏదైనా కానివ్వండి. కామెడీ, డాన్సర్స్ ఇలా ఎవరినైనా తీసుకొచ్చి ప్రోగ్రాం చేయగలుగుతా. అలాంటి అవకాశం ఉన్నా నాకు చెప్పండి.

**నా చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి**

అవకాశాల కోసం చూస్తున్న క్రమంలోనే కొంతమంది స్నేహితులు ఇచ్చిన సలహాతో potti vijaya official పేరుతో యుట్యూబ్ చానెల్ మొదలు పెట్టిన. దాని నుంచైన నాలుగు పైసలు సంపాదిద్దామనుకుంటున్న.దయచేసి మీరు నా చానెల్‌ను లైక్ చేసి సబ్‌స్క్రైబ్ చేసుకోండి ప్లీజ్.



**- మధుకర్ వైద్యుల**
సీనియర్ జర్నలిస్ట్

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# నేడు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**వనపర్తి:** కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొనను న్నారు. మంగళవారం నాడు ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు వనపర్తి మండలం పట్టణంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రారంభం కానుంది. అనంతరం, ఎమ్మెల్యే 12 గంటలకు గోపాల్పేట తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రేవల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో మరియు సాయంత్రం 4 గంటలకు ఖిల్లా ఘనపురం తాసిల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నారు.ఈ కార్యక్రమాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తూ, వారి జీవితాలను మెరుగుపరచడం లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి మద్దతు ప్రకటించారు.



## శ్రీశైలం ముంపు బాధితులు తమకు ఉద్యోగాలు కల్పించాలి

- **రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డికి వినతి**

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో, 198081 సంవత్స రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహ బూబ్‌నగర్ జిల్లాలో 67 గ్రామాలు పూర్తిగా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయాయని వారు తెలిపారు. ఈ గ్రామాల నిర్వాసితులు, GO98 ప్రకారం, ఒక్కో కుటుంబానికి ఒక ఉద్యోగం కల్పించాలని 2014లో Dsc కమిటీ ద్వారా 2000 మంది లిస్ట్ తయారు చేయిం చారని అయితే, 2014 నుండి 2023 వరకు టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరూ ఉద్యోగాలను పొందలేకపోయారని నిర్వసితులు వాపోయా రు.ఈ నేపథ్యంలో, శ్రీశైలం ముంపు బాధితులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డిని కలిసి, తమకు ఉద్యోగాల కోసం న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశా రు. చిన్నారెడ్డి స్పందిస్తూ, ఈ సమస్యను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే న్యాయం చేసే విధంగా బాధితులకు హామీ ఇచ్చారు.ఈ కార్య క్రమంలో శ్రీశైలం నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దమందడి ఎస్ఐగా యుగంధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ




**వారధి న్యూస్, పెద్దమందడి:** పెద్దమందడి మండల పోలీస్ స్టేషన్‌లో కొత్త సబ్ ఇన్స్పెక్టర్‌గా *యుగంధర్ రెడ్డి* సోమవారం రోజున బాధ్య తలు స్వీకరించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహించిన యుగంధర్ రెడ్డి, ప్రస్తుతం పెద్దమందడి పోలీస్ స్టేషన్‌కి ఎస్ఐగా నియమితులయ్యారు.
మునుపటి ఎస్ఐ శివకుమార్ వనపర్తి ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత యుగంధర్ రెడ్డి, మండల ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులు తమకు సహకరించాలని కోరారు. అలాగే, ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా సేవలు అందిస్తామని తెలిపారు.

## ప్రతి మండల సమాఖ్యలో కస్టం హైరింగ్ సెంటర్ల ఏర్పాటు

- **జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**




**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి జిల్లా ప్రతి మండల సమాఖ్యలో కస్టం హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. ఇప్పటికే జి ల్లాలోని 11 మండలాల్లో ఈ సెంటర్లు ఏర్పాటు చేయబడ్డాయని, ఇక అమరచింత, చిన్నంబావి, రేవల్లి మండలాల్లో కూడా కొత్తగా కస్టం హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చి నట్లు తెలిపారు.సోమవారం సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన డి.ఆర్.డీ.ఓ, డి.ఏ.ఓ, డి.హెచ్. యస్.ఓ, మరియు మూడు మండలాల ఏ.పి.యం లతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్రోన్లు, గుంతలు తీసే యంత్రాలు, ఎలక్ట్రిక్ రంపపు యంత్రాలు, గడ్డి చుట్టలు చుట్టే పరికరాలు, వాటర్ ట్యాంకర్లు, చెట్లు ఎక్కే నిచ్చెన లు వంటి పరికరాలకు ప్రస్తుతం అధిక డిమాండ్ ఉందని, ఈ పరికరాలను కొత్తగా ఏర్పాటు చేయబోయే సెంటర్లలో కొనుగోలు చేసి అద్దెకు ఇవ్వవచ్చని వివరించారు.ఈ చర్యతో రైతులకు వ్యవసాయ పరికరాలు సులభంగా లభించడంతో పాటు, వ్యవసాయ పనులు సమర్థవంతంగా సా గుతాయని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## హైదరాబాదులో జరిగే ప్రజావాణి తేదీలో స్వల్ప మార్పు

- **జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి**



**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్, బేగంపేట, హైదరాబాద్‌లో నిర్వ హిస్తుంది. అయితే, ఈ నెల 10న మంగళవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం 16వ కేంద్ర ఆర్థిక సంఘం సమావేశాల కారణంగా, 11వ తేదీ బుధవారంకి వాయిదా వేయబడింది. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు, అర్జీదారులు ఈ మార్పును గమనించి బుధవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలంటూ విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ కొనసాగుతోంది

- **సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి**



**వారధి న్యూస్, గండిపేట్:** బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మరియు యువ నాయకుడు పట్లో ళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆ ర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం వారిని మర్యా దపూర్వకంగా కలసి సన్మానించి పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు మారినప్ప టికీ, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త లు మరియు నాయకులు బలంగా ఉన్నారు అని చెప్పారు. తెలంగాణ హైకోర్టు ఎమ్మల్యేలు నర్హత పిటిషన్‌ల పై ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ యొక్క అప్ర జాస్వామ్య విధానాలకు చెంప పెట్టడంలాంటిదని వ్యాఖ్యానించారు.కార్తీక్ రెడ్డి తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురి కావడం తథ్యం అన్నారు. ఈ తీర్పు ప్రజాస్వామ్యా న్ని, రాజ్యాంగ స్పూర్తిని నిలబెట్టే విధంగా ఉందని చెప్పారు. 20 ఏళ్ల నుంచి ఒక లెక్క ఇప్పుడు కొత్త తరం నాయకులు వచ్చారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురయ్యే నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని పేర్కొన్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజక వర్గంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అభిప్రాయ పడ్డారు. రాజేంద్రనగర్ బైఎలక్షన్స్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని, అక్కడ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకులు ప్రతిష్ట చేసినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్, మాజీ కౌన్సిల ర్ ఎస్. వెంకటేష్, రఘుయాదవ్, రాముయాదవ్, బండ రాజేష్, జై భగవాన్‌దాస్, కొంపల్లి జగదీష్, అరుణ్‌ముదిరాజ్, కిషోర్, రవి పాల్గొన్నారు.



## కొత్తచెరువు నిండే అవకాశం

- **ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం**

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం కొత్తచెరువు పూర్తిగా నిండే అవకాశముంది. ఈ నేపథ్యం లో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా, జిల్లా కలెక్టర్ విజయేం దిర బోయి తటస్థ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.సోమవారం, కలెక్టర్ విజయేందిర బోయి మినీ ట్యాంకుబండ్ పరిసర లోతట్టు ప్రాంతాలను, ముఖ్యంగా రామయ్య భౌలీ, బికే రెడ్డి కాలనీ, శివశక్తి నగర్ వంటి కాలనీలను సం దర్శించారు. ట్యాంకుబండ్ లోకి పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న కారణంగా ఎప్పుడైనా ట్యాంకుబండ్ నిండే అవకాశముందని, అందువల్ల లోతట్టు ప్రాం తాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.
చెరువు నీరు అలుగు పారడం ప్రారంభమైనప్పుడు కింది వైపు ఉన్న కాలనీల ప్రజలను అవసరమైతే పు నరావాస కేంద్రానికి తరలించేందుకు ముందుగానే ఫంక్షన్ హాల్ వంటి ఆప్షన్లను సిద్ధం చేయాలని సూచించారు. ఆమె కొత్తచెరువులోకి వచ్చే ఫీడర్ ఛానల్ లను, రామయ్య బౌలి అలుగు ను కూడా పరిశీలించారు. శివశక్తి నగర్ లో పురోగతిలో ఉన్న మున్సిపల్ పనులను కూడా ఆమె తనిఖీ చే శారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్ డి ఓ నవీన్, ఇరిగేష న్ డిఇ మనోహర్, అర్బన్ తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.





## క్షేత్ర స్థాయి సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- **సీపీ సుధీర్ బాబు**

**వారధి న్యూస్, మల్కాజిగిరి:** రాచకొండ పరిధి లోని ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి సంక్షేమ చర్యల్లో భాగంగా 500 నూతన తెల్లటి టోపీలను సీపీ సుధీర్ బాబు సోమవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడు తూ, క్షేత్ర స్థాయి సిబ్బంది శ్రేయస్సుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాచకొండ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అహర్నిశలు కృషి చే స్తున్న సిబ్బందికి ఈ టోపీలు ఒక చిరు ప్రశంస అని, వారి విధి నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.ట్రాఫిక్ సిబ్బంది రోజువారీ విధులలో ఎదుర్కొంటున్న ఇబ్బందు లను తెలుసుకున్న కమిషనర్, ఎండలు మరియు వర్షం నుండి సిబ్బందికి మరింత సౌకర్యాన్ని అందించే ఉద్దేశంతో కొత్తగా రూపొందించిన టోపీలను అందించారన్నారు. గతంలో ఇచ్చిన వైట్ హెల్మెట్ ల బరువు సుమారు 365 గ్రాములు కాగా, కొత్త ట్రాఫిక్ టోపీల బరువు 165 గ్రాములు మాత్రమే. తద్వారా, రోజువారీ విధుల నిర్వహణ లో ఈ టోపీలు సులభంగా ఉపయోగించవచ్చని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో డిసిపి శ్రీనివాసులు మరియు ఇతర ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలకు అందుబాటులో పోలీస్ శాఖ

- **హోం గార్డ్ కుటుంబాలకు ఆర్థిక భరోసా**
- **జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**వారధి న్యూస్, నల్లగొండ:** ప్రతి సోమవారం నిర్వ హించే గ్రీవెన్స్ డే సందర్భంగా, జిల్లా పోలీసు కార్యా లయంలో జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 40 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి, సమస్యలపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆయన ఆదేశిం చారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలను పరి ష్కరించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులలో భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సంబంధిత సమస్యలు ప్రధానంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారు లకు భరోసా మరియు నమ్మకం కలిగించేందుకు, పోలీసు స్టేషన్ లో మర్యాదగా మాట్లాడి వినతులను స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగంగా స్పందించాలని ఎస్పీ సూచించారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరిం చాలని చెప్పారు.జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డ్ ల సంక్షేమం కొరకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారని, 26 మంది హోంగార్డ్ లకు మెరిట్ స్కాల ర్షిప్ లు, పిల్లల పెళ్ళిలకు ఆర్థిక సహాయం, మెడికల్ రియంబర్స్మెంట్ తో పాటు విధి నిర్వహణలో మర ణించిన హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, యస్బి డీయస్పీ రమేష్, ఏఆర్ డియస్పీ శ్రీనివాసు లు, హోంగార్డ్ ఆర్ఐ నరేష్ తదితర హోంగార్డులు పాల్గొన్నారు.




## మిషన్ పరివర్తనతో గంజాయి నిర్మూలన

- **డిఎస్పి శివరాంరెడ్డి**

**వారధి న్యూస్, నల్లగొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మత్తు వ్యతిరేక ఉద్యమంలో మిషన్ పరివర్తన కార్యక్రమం కీలకమైనదని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో, నల్లగొండ రూరల్ పరిధిలోని అన్నారె డ్డిగూడెం గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ నిర్మూలనపై అవగా హన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పి శివరాంరెడ్డి, విద్యార్థులతో ప్రసంగిస్తూ, మత్తు పదార్థాల మరియు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పిం చడం అత్యంత కీలకమని చెప్పారు. యువత సామాజిక స్పృహతో, సత్ప్రవర్తనతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన సూచించారు. సైబర్ క్రైమ్ మరియు సైబర్ అడిక్షన్ సమస్యలపై విద్యార్థులకు వివరిస్తూ, సాంకేతికతను అభివృ ద్ధి కోసం ఉపయోగించాలని, వినోదం మరియు విధ్వంసం కోసం కాకుండా ఉపయోగించుకో వాలని కోరారు. మత్తు పదార్థాలు యువతను ని ర్వీర్యం చేస్తున్నాయి కనుక, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాల యం సహయ ఆచార్యులు డాక్టర్ లక్ష్మల మధు, రూరల్ ఎస్సై సైదాబాబు, కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, బాడిగల శ్రవణ్, అధ్యాపక బృందం, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





## మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్**

**వారధి న్యూస్, గండిపేట్:** రాజేంద్రనగర్ నియో జకవర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ సోమవారం, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 3, 13, 14, 15వ వార్డులలో సీసీ రోడ్డు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు లో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టామన్నారు. అభి వృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ప్రతిసారి సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రా జేందర్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు మరియు నాయకులుఇతరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా ప్రజావాణికి 194 ఫిర్యాదులు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ లతో జిల్లా కలెక్టర్ కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 194 ఫిర్యాదులు వచ్చాయి.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించటం పై నిర్లక్ష్యం వహించారాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం అల్లిపూర్ గ్రామ పంచాయితీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ఏడు నెలల నుంచి జీతం ఇవ్వలేదని గ్రామ కార్యదర్శి ముందు క్రిమిసంహారకమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆ ఉద్యోగిని నాగర్ కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అల్లిపూర్ గ్రామ పంచాయితీ ఉద్యోగికి గత ఏడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని కుటుంబసభ్యులు తెలిపారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం విషాదకరమని గ్రామస్తులంటున్నారు.ప్రభుత్వం వెంటనే అతనికి మెరుగైన వైద్యం అందించి పూర్తి వేతనం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి కోరారు.గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య ఉద్యోగుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించి, పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ ప్రజా భవన్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రజావాణి 11కు వాయిదా

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి లో హైదరాబాద్, మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారని కలెక్టర్ బాదావత్ సంతోష్, సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.
ఈ నెల 10న ప్రజాభవన్ లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం జరుగనున్న నేపథ్యంలో మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణిని బుధవారానికి మార్చినట్టు ప్రజా పాలన ప్రత్యేక అధికారిణి దివ్య తెలియజేశారని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా నుండి హైదరాబాద్ వెళ్లి రాష్ట్రస్థాయి ప్రజావాణిలో దరఖాస్తు చేసే జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించాలని కలెక్టర్ కోరారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఉత్సవ కమిటీ అధ్యక్షులు బిళ్ళకంటి హరిబాబు



**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహించే 54వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పట్టణంలోని ఆర్య వైశ్యులు సహాయ సహకారాలు అందించాలని ఆలయ కమిటీ అధ్యక్షులు వాసా ఈశ్వరయ్య కోరారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ అధ్యక్షులుగా బిల్లకంటి హరిబాబును నిర్ణయించడం జరిగిందని ప్రతి ఒక్కరూ ఉత్తమ కమిటీకి సహాయ సహకారాలు అందించడంతోపాటు పూజలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు పూజా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం మరియు ఆలయ కమిటీ తోపాటు అన్ని అనుబంధ సంఘాలు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు





## సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**వారధి న్యూస్, హైదరాబాద్:** పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ యాసకు, భాషకు జీవం పోసి, ప్రజా ఉద్యమాలకు ఊపిరినిచ్చిన మహనీయుడు కాళోజీ అని ఆయన కొనియాడారు. సోమవారం రవీంద్రభారతిలో కాళోజీ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో "ప్రజాకవి కాళోజీ మానవతా విలువలు" అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలన అనంతరం కాళోజీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించిన మంత్రి, కాళోజీ తెలంగాణ సమాజానికి చేసిన సేవలను ప్రశంసిస్తూ, ఆయన కవితలు, ఉద్యమాలు, తెలంగాణ భాష కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. అన్యాయం జరిగిన ప్రతి చోట గళమెత్తి, దోపిడీ, నిరాదరణకు గురవుతున్నవారిలో ఆయన చైతన్యం నింపినట్లుగా పేర్కొన్నారు. కాళోజీ కవితా సంకలనం 'నా గొడవ'లోని పద్యాలను ఉటంకిస్తూ, ఆయన కవితా శక్తి, బావుకత, పోరాట తపనను కొనియాడారు.ఈ వేడుకలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నమోజు బాలాచారి, సంచాలకులు డా. మామిడి హరికృష్ణ, ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీ, మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## న్యాయవాదులతో వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి ప్రత్యేక సమావేశం

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి కోర్టు న్యాయవాదులతో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం, బార్ అసోసియేషన్ మందిరంలో న్యాయవాదులతో భేటీ అయ్యి, వారి సమస్యలు, కోర్టు పరికరాలు మరియు ఇతర కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ కుమార్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి, న్యాయవాదులు వెంకటేష్, జంపన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.




## వ్యక్తి మృతి కేసులో ఇద్దరు అరెస్టు

- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**వారధి న్యూస్, తూప్రాన్:** దొంగతనం చేయడానికి వచ్చాడని అనుమానించిన నేపథ్యంలో ఒక వ్యక్తిని కొట్టి బైక్ పై తీసుకెళ్తూ పారిపోతు చనిపోయిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు.తూప్రాన్ డిఎస్పి కార్యాలయంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడిన ఎస్పీ, శివంపేట మండలంలోని గోమారం గ్రామంలో ఈ నెల 4 తేదీన జరిగిన ఈ సంఘటన వివరాలు వెల్లడించారు. అనుమానాస్పదంగా గ్రామంలో తిరుగుతున్న వ్యక్తిని దొంగతనం చేయడానికి వచ్చాడని భావించి, గ్రామస్థులు గంగిరెడ్డి తిరుపతిరెడ్డి మరియు వంటిముక్కల మణికంఠ గౌడ్ అతన్ని తీవ్రంగా కొట్టారు. తర్వాత, బైక్ పై అతన్ని తీసుకెళ్లి, బైక్ పై నుండి దూకిన వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో చనిపోయాడు.ఈ ఘటనలో సంబంధిత ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి, సిఐ రంగాకృష్ణ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలి

- ఎస్పీ రావుల గిరిధర్

**వారధి న్యూస్, వనపర్తి:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, పిర్యాదుదారుల నుంచి 8 ఫిర్యాదులు స్వీకరించారు.పిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టపరంగా పరిష్కరించాలని సంబంధిత ఎస్ఐ మరియు సీఐలకు సూచనలు ఇచ్చారు. ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం కోసం ఫోన్ ద్వారా స్టేషన్ల అధికారులతో మాట్లాడి, సమస్యల పరిస్థితిని సమీక్షించారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, ప్రజలు ఎటువంటి పైరవీలు లేకుండా, స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలనీ, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరై శాంతి భద్రతలను పరిరక్షించడం జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా పిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## త్రాగునీటిలో గణేష్ విగ్రహాలు నిమర్జనం చేయవద్దు

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్




**వారధి న్యూస్, సూర్యాపేట:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, స్థానికంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం, ప్రతి మండపాన్ని గ్లోబల్ జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సోమవారం ప్రకటనలో వెల్లడించారు.త్రాగునీటి అవసరాలకు ఉపయోగించే నీటిలో గణేష్ విగ్రహాలు నిమర్జనం చేయవద్దని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా సాగర్ కెనాల్, శ్రీరామ్ సాగర్ కెనాల్ లలో విగ్రహాలు నిమర్జనం చేయడం వల్ల నీరు కలుషితమై, ప్రజల ఆరోగ్యానికి హానికరం అవుతుందని హెచ్చరించారు. గణేష్ విగ్రహాలు స్థానికంగా అందుబాటులో ఉన్న చెరువులు, కుంటలలో నిమర్జనం చేసుకోవాలని కోరారు. నిమర్జనం కోసం వాహనాల్లో ఎక్కువ దూరం ప్రయాణం చేయడం ప్రమాదకరమని, అందుకే స్థానికంగా నిమర్జనం చేయాలని తెలిపారు.నిమర్జన సమయంలో పిల్లలు, మహిళలు, వృద్ధులను వాహనాల్లో నిమర్జనం కోసం తీసుకెళ్లవద్దని, డీజేలు వినియోగించవద్దని, బాణాసంచా కాల్చవద్దని ఎస్పీ సూచించారు. ఈ సూచనలు పాటిస్తూ, ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉండాలని మరియు పర్యావరణాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## వరద ముప్పు ప్రభావిత ప్రాంతాలలో పునరుద్ధరణ పనులు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వారధి న్యూస్, సూర్యాపేట:** వరద ముప్పు ప్రభావిత ప్రాంతాలలో పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో, అదనపు కలెక్టర్ బి ఎస్ లత తో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.అతి భారీ వర్షం వల్ల తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న ప్రాంతాల్లో, కాలువ కట్టలు, చెరువులు, రోడ్లు, కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు మరమ్మతులు చేయాలని, అలాగే వరదతో మునిగిన పంట పొలాలు, మరణించిన పశువులు, కూలిన ఇండ్లపై నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేమ హాస్టల్స్, రెసిడెన్సియల్ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చూడటం కోసం ప్రత్యేక అధికారులు సందర్శించాలని, నివేదికలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో వచ్చే రాష్ట్ర స్థాయి ప్రజావాణి దరఖాస్తులు మరియు జిల్లా ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, హైదరాబాద్ లో జరగబోయే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10 నుండి 11వ తేదికి వాయిదా వేయబడిందని, ప్రజలు బుధవారం హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టరేట్ సిబ్బంది అందరు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పాటించాలన్నా, లేకుంటే చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. జాతీయ స్థాయి పంచాయతీ రాజ్ అవార్డులకు గ్రామ పంచాయతీలు దరఖాస్తు చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో, భూ సమస్యల కోసం 43 దరఖాస్తులు, జిల్లా సంక్షేమ అధికారి కోసం 7 దరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారికి 6 దరఖాస్తులు, డి ఆర్ డి ఓకి 5 దరఖాస్తులు చేరుకున్నాయని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ అప్పారావు, డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి ఈ ఓ అశోక్, డి ఎం హెచ్ ఓ కోటాచలం, సంక్షేమ అధికారులు శంకర్, లత, అనసూర్య, జగదీశ్వర్ రెడ్డి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్

**వారధి న్యూస్, గద్వాల :** జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుండి అందిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మరియు వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, అదనపు కలెక్టర్లు నర్సింగా రావు మరియు శ్రీనివాస రావు (రెవెన్యూ) తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి మొత్తం 50 దరఖాస్తులను స్వీకరించామన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను సూచించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలను అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని, అర్జీదారులు కార్యాలయాలకు తరుచూ రాకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.





## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన, మరియు రచనల ద్వారా ప్రజలలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని సృష్టించిన మహానుభావులు కాళోజీ నారాయణరావు అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.ఈ సందర్భంగా, కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.కాళోజీ నారాయణరావు రచయిత, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు తెలంగాణ ఉద్యమకారుడుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఆయన రచించిన "నా గొడవ" ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిందని, "సామాన్యుడే నా దేవుడు" అనే నినాదం ఆయనదని, "పుట్టుక నీది, చావు నీది, బతకంతా దేశానిదన్న" స్ఫూర్తితో జీవితాన్ని తెలంగాణకు అంకితమిచ్చారని కొనియాడారు. అలాంటి మహనీయుని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,డిఆర్ఓ రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్, డిఆర్డిఓ నరసింహులు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం* మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## నిరుపేద విద్యార్థినికి చదువుకు ఆర్థిక సహాయం

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో బి.ఎ తృతీయ సంవత్సరం చదువుతున్న రూతమ్మకు ప్రవేశ రుసుమును ప్రిన్సిపల్ ప్రొఫెసర్. వి. రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా ఆర్థిక సహాయ నిధిని అందించారు .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కళాశాలలోని బోధన సిబ్బంది ద్వారా సేకరించిన ఆర్థిక సహాయ నిధిని పేద విద్యార్థుల చదువుల కోసం ఖర్చు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి పి. సుధాకర్ రెడ్డి, పూర్ ఫండ్ కమిటీ కన్వీనర్ డాక్టర్. పి. విజయలక్ష్మి బోధనేతర సిబ్బంది రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఉచిత పండ్ల మొక్కల పంపిణీ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** హన్వాడ మండలం నాయనోనిపల్లి గ్రామ రైతులకు ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు గ్రామీణ అభివృద్ధి మరియు జీవనోపాధి మెరుగుదల కోసం దాదాపు పది రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హన్వాడ ఎం.ఆర్.ఓ కృష్ణ నాయక్ పాల్గొని, నాయనోనిపల్లి గ్రామ రైతులు వ్యవసాయంలో అభివృద్ధి సాధించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు ఎల్లవేళలా సహాయం అందిస్తారని, వారి మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు రవి కుమార్, రాజు, కృష్ణ, కిష్టయ్య అలాగే గ్రామ రైతులు మరియు మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## భూత్పూర్ ఊర చెరువు స్లూయిస్ వద్ద కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** భూత్పూర్ ఊర చెరువు ను సోమవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలి భారీ వర్షాల కారణంగా చెరువు స్లూయిస్ వద్ద కట్టకు దెబ్బ తినడం, నీరు వృధాగా వెళ్ళడం గమనించిన కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్లూయిస్ వద్ద ఏర్పడిన రంధ్రాలకు శాశ్వత మరమ్మతులు చేయడానికి అంచనాలు తయారు చేసి పంపించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన ఇంజనీరింగ్ అధికారులకు ఆమె స్పందించి వెంటనే మరమ్మతుల చర్యలను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ తనిఖీ సమయంలో తహసిల్దార్ రాజు, ఎంపీడీవో ప్రభాకర్ రావు, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ దయానంద్, డీఈ అబూ సిద్ధికి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ తదితరులు కూడా పాల్గొన్నారు.



## తుమ్మల కుంట చెరువును పరిశీలించిన లోకాయుక్త అధికారులు

- చెరువులు, కుంటలను కబ్జా చేస్తే కఠిన చర్యలు
- లోకాయుక్త

**వారధి న్యూస్, మహేశ్వరం:** మహేశ్వరం మండలంలోని సర్దార్ నగర్, సర్వే నంబర్ 131లో ఉన్న తుమ్మల కుంట చెరువును లోకాయుక్త ఎం ఆర్ ఓ, ఎరిగేషన్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మరియు ఇతర అధికారులు సోమవారం పరిశీలించారు.గత కొన్ని నెలలుగా, ఈ చెరువును కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి, రాళ్లతో నింపి, ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని సర్దార్ నగర్ గ్రామస్తులు ఆరోపించారు. వారు చెరువులో వర్షపునీరు పోవడానికి ఉపయోగించే కల్వర్ట్‌ను కూడా పూడ్చివేశారని పేర్కొన్నారు. అవినీతిని చూపిస్తూ, గ్రామస్తులు ప్రభుత్వ భూమిలో అనధికారంగా రోడ్లు వేసుకోవడం, ఇళ్ల నిర్మాణం చేయడం వంటి కట్టడాలు చేపట్టారని తెలిపారు.ఈ మేరకు, లోకాయుక్త అధికారులు తుమ్మల కుంట చెరువును పరిశీలించి, కబ్జా చేసిన వారిపై త్వరలో కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్లు, ప్రహరీ గోడలను వెంటనే కూల్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇకపై, ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారు, కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లోకాయుక్త అధికారులు హెచ్చరించారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జి హెచ్ ఎం టి. సునీతకు సన్మానం


**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జి హెచ్ ఎం టి. సునీతను రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోటకొండ లో జి హెచ్ ఎం గా విధులు నిర్వహిస్తున్న సునీత, విద్యాభివృద్ధికి అందించిన విశేష సేవల పురస్కారంగా, హైద్రాబాద్ లోని రాష్ట్ర మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మరియు ఇతర రాష్ట్ర ఉన్నతాధికారుల చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సన్నిధి ఆశ్రమం లో ప్రత్యేక సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రెడ్ క్రాస్ కోశాధికారి సురభి జగపతి రావు,రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ జి. రమణయ్య, యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్తలు బాబుల్ రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, బాల్ లింగయ్య, అశోక్ కుమార్, మేనేజర్ నరసింహా, సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. జగపతి రావు మాట్లాడుతూ, ఎస్ జి టి నుంచి జి హెచ్ ఎం వరకు ఎదిగిన సునీత విద్యాభివృద్ధికి అందించిన సేవలు అమోఘమని, ఇదే స్ఫూర్తితో పని చేస్తూ అందరి మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంలో, సునీతను శాలువులు, పూల మాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు.



## వనపర్తి పట్టణంలో బిల్డింగ్ పర్మిషన్లలో అవినీతి

- అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్

**వారధి న్యూస్,వనపర్తి:** పట్టణంలో లే, ఔట్లలో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రధాన జలాశయాలైన వాగులు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని అరికట్టాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ, వనపర్తి పట్టణంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో రాజనగరం రోడ్డులో ఒక బిల్డింగ్ పర్మిషన్ పై ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆ పర్మిషన్‌ను రద్దు చేసినప్పటికీ, ఆ అవినీతి పథకంలో మళ్లీ కొత్త పర్మిషన్ నెంబర్ ద్వారా తక్కువ ధరకే పర్మిషన్ ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.అదేవిధంగా, వనపర్తి మున్సిపాలిటీకి రూ. 28 లక్షల ఆదాయం రావాల్సిన చోట, రూ. 8 లక్షలకే కుదించారని, టౌన్ ప్లానర్ అవినీతిపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఐక్యవేదిక విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ అవినీతి వ్యవహారంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. జలాశయాలైన తాళ్ళచెరువు, నల్లచెరువు వంటి వాగులు కబ్జాకు గురయ్యాయని, వాటి పరిమాణాలు గుర్తించి సంరక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే టౌన్ ప్లానర్ల లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్సీ నాయకులు గంధం సుమన్, బీసీ నాయకులు గౌను కాడి యాదయ్య, బి ఆర్ ఎస్ నాయకులు బొడ్డుపల్లి సతీష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

- డీసీఎం వాహనం బోల్తా

**వారధి న్యూస్, మిర్యాలగూడ:** దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న దేవరకొండ ప్రాంతానికి చెందిన యువకులు యాది (22) మరియు రిజ్వాన్ (36) మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో టాటా నెట్ వర్క్ కు చెందిన నలుగురు కార్మికులు రోడ్డు పక్కన కేబుల్ పనులు చేస్తున్నారనే సమాచారం అందింది. ఘటన స్థలానికి చేరుకున్న వాడపల్లి పోలీసులు మృతదేహాలను, క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హైడ్రాను జాతీయ ప్రయోజనాలకు ఉపయోగించాలి

- మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు

**వారధి న్యూస్, సిద్దిపేట:** బఫర్ జోన్ మరియు చెరువుల శిఖం భూములలో నిర్మాణాలు చేపట్టడం నిషేధించిన సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ ప్రకారం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాను రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా జాతీయ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు కోరారు.సోమవారం పట్టణంలోని ఎన్జీవోస్ భవన్ లో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణాలను కూల్చేటప్పుడు రాజకీయాలు, రంగులు చూడు కాకుండా, జాతీయ ప్రయోజనాలను చూసి చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే, వినాయక ఉత్సవాల సమయంలో పోలీసు కానిస్టేబుల్ ను ట్రాన్స్‌ఫర్ చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసును బదిలీ చేసి ఆనందును నియమించడంపై ఆయన విమర్శలు చేశారు. రఘునందన్ రావు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం దేశ హితం కోసం నూతన చట్టాలను తెచ్చింది, దేశంలో ప్రతీ రంగంలో సమూల మార్పులు తెచ్చింది అని పేర్కొన్నారు. బిజెపి పార్టీ మాత్రమే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను నిర్వహించి నాయకత్వాన్ని ఎన్నుకుంటుందన్నారు. సిద్దిపేటలో అనేక న్యాయవాదులు బిజెపి సభ్యత్వం తీసుకుంటున్నారని, ఇది మారుతున్న దేశ రాజకీయాలకు సంకేతమని ఆయన అన్నారు.బిజెపి పార్టీ 'నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, ఇండిపెండెంట్ లాస్ట్' అనే సిద్ధాంతంతో పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ బిజెపి సభ్యత్వం



తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, నరేష్, ఉపేందర్, శంకర్, భూపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

7
మంగళవారం, 10.09.2024
వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com



# లండన్‌లో రాశీ ఖన్నా



టాలీవుడ్ టు బాలీవుడ్ రాశీఖన్నా జర్నీ గురించి తెలిసినదే. ఇక్కడ అడపాదడపా అవకాశాలు అందుకుంటున్న రాశీ ఇటీవల హిందీ చిత్రసీమపైనా గురి పెట్టింది. అక్కడ షాహిద్ లాంటి స్టార్ సరసన నటించింది. పెద్ద తెర, ఓటీటీ రెండు చోట్లా అవకాశాలు అందుకుంటూ కెరీర్ ని బ్యాలెన్స్ చేస్తోంది. మరోవైపు తమిళంలోను ఈ బ్యూటీ నటిస్తోంది. హిందీలో వరుసగా ప్రయోగాలు చేస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం `ట్వెల్త్ ఫెయిల్` నటుడు విక్రాంత్ మాస్సేతో కలిసి మరో ప్రయోగాత్మక చిత్రంలో నటిస్తోంది. ఇది నిజ ఘటనల ఆధారంగా రూపొందుతోంది.గుజరాత్ అల్లర్లు, గోధ్రాలో సబర్మతి ట్రెయిన్ దహనం నేపథ్యంలో రూపొందుతున్న `ది సబర్మతి రిపోర్ట్` తన కెరీర్ లో పెద్ద మలుపునిస్తుందని రాశీ భావిస్తోంది. గోధ్రా సంఘటన, గుజరాత్ అల్లర్ల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గతంలో IPS ఆఫీసర్ మనోజ్ శర్మగా నటించిన విక్రాంత్ మాస్సే ది సబర్మతి రిపోర్ట్‌లో హిందీ జర్నలిస్ట్‌గా నటిస్తున్నాడు. విక్రాంత్- రాశితో పాటు, జవాన్ నటుడు రిద్ధి డోగ్రా కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం 3 మే 2024న భారీ స్క్రీన్ లలో విడుదల కానుంది. షాహిద్ తో యోధ తర్వాత రాశీకి ఇది మరో క్రేజ ఆఫర్.  ? మరోవైపు తెలుగులో తెలుసు కదా, తమిళంలో మేధావి చిత్రాల్లోను రాశీ నటిస్తోంది. టిఎంఇ అనే హిందీ చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది. ఈ సినిమాలన్నీ రిలీజ్ లకు వచ్చే లోపు రాశీ వరుస ఫోటోషూట్లతో సోషల్ మీడియాల్లో అభిమానులకు టచ్ లో ఉంటోంది. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో గుబులు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం లండన్ ట్రిప్ నుంచి కొన్ని అరుదైన క్లిక్స్ ని షేర్ చేస్తోంది. అక్కడ మిట్ట మధ్యాహ్నం విహారంలో ఉన్నప్పటి ఫోటోగ్రాఫ్ ఒకటి అంతర్జాలంలోకి వచ్చింది. పూర్తిగా ఉలెన్ కోట్ తో కప్పుకుని, రాశీ స్టైలిష్ లుక్ లో కనిపించింది. లండన్ లో చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ఈ భామ స్పెషల్ కేర్ తీసుకుంటోందని అర్థమవుతోంది. లండన్ లో రాశీ రియల్ క్వీన్ ని తలపిస్తోందంటూ అభిమానులు ఈ లుక్ కి కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

## 13 నుంచి జీ5లో 'రఘు తాత'



మహానటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ఘు తాత. హోంబళే ఫిల్మ్స్ బ్యానర్ మీద విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రానికి సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆడియెన్స్ థియేటర్లో మంచి రెస్పాన్స్‌ను ఇచ్చారు. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతోంది. సెప్టెంబర్ 13 నుంచి ఈ చిత్రం జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులో ఉండనుంది. ఓటీటీ రిలీజ్ డేట్ ప్రకటించిన ఈ తరుణంలో కీర్తి సురేశ్ మాట్లాడుతూ.. 'నమ్మిన దాని కోసం నిలబడే ఓ ధైర్యశాలి పాత్రను రఘు తాత చిత్రంలో పోషించడం ఆనందంగా ఉంది.  ఆ పాత్రకు జీవం పోయడం ఓ సవాలుగా అనిపించింది. ZEE5లో ఈ ఆకర్షణీయమైన కథనం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరువ అవుతుండటం సంతోషంగా ఉంది' అని అన్నారు. హోంబలే ఫిలింస్ అధినేత విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ.. "రఘుతాత' ప్రపంచ డిజిటల్ ప్రీమియర్ కోసం ZEE5తో భాగస్వామి అయినందుకు మాకు సంతోషంగా ఉంది. విజువల్ ట్రీట్, ఎమోషనల్ జర్నీగా సాగే రఘు తాత చిత్రం ఈ ZEE5 ద్వారా అందరి వద్దకు చేరుతోంది. 'రఘుతాత' అనేది మాకు ఒక ప్రత్యేక ప్రాజెక్ట్. ఇది సున్నితత్వం, హాస్యంతో ఉండటమే కాదు సామాజిక సమస్యలను తెలియజేస్తుంది' అని అన్నారు. దర్శకుడు సుమన్ కుమార్ మాట్లాడుతూ.. "రఘుతాత' సినిమా మా జీవితంలో ఓ మరుపురాని ప్రయాణంగా నిలుస్తుంది. ఈ చిత్రం భాషా, ప్రాంతం అన్న తేడా లేకుండా అందరినీ అలరించగలిగింది. ఇక ZEE5లో ప్రపంచ డిజిటల్ ప్రీమియర్ కోసం ఎదురు చూస్తున్నాను' అని అన్నారు.

## రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ 'కాంత' షూటింగ్ ప్రారంభం



రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిల్మ్స్ కొలాబరేషన్లో మోస్ట్ ఎవైటెడ్ మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్ "కాంత" హైదరాబాద్‌లోని రామా నాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైంది. విక్టరీ వెంకటేష్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ కొలాబరేషన్ గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరిరియన్స్ ని అందించదానికి రెండు క్రియేటివ్ పవర్‌హౌస్‌లను ఒకచోట చేర్చింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ కు జోడిగా భాగ్యశ్రీ నటిస్తున్నారు. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఈరోజు చిత్రీకరణ కూడా ప్రారంభమౌతోంది. 1950 మద్రాస్ బ్యాక్ డ్రాప్ లో హ్యూమన్ రిలేషన్స్, సోషల్ చైంజెస్ ని ఎక్స్ ప్లోర్ చేసే గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ గా ఈ సినిమా వుండబోతోంది.  రానా దగ్గుబాటి మాట్లాడుతూ..కాంత కోసం వేఫేరర్ ఫిల్మ్స్‌తో భాగస్వామ్యం కావడం ఈ ప్రాజెక్ట్‌కి కొత్త డైమెన్షన్ ని యాడ్ చేసింది. క్యాలిటీ సినిమా పట్ల మా విజన్ ఒకేలా వుంటుంది. సురేశ్ ప్రొడక్షన్స్ 60వ యానివర్సరీని పురస్కరించుకుని, స్పిరిట్ మీడియాతో కొత్త శకానికి నాంది పలికేందుకు పర్ఫెక్ట్ మూవీ 'కాంత''. అన్నారు.  హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. " స్పిరిట్ మీడియాతో 'కాంతా'తో ఈ జర్నీ ప్రారంభించడం పట్ల ఉత్సాహంగా ఉన్నాను. ఇది మానవ భావోద్వేగాల లోతులను ఆవిష్కరించే అందమైన లేయర్డ్ కథ. ఒక నటుడికి పెర్ఫార్మెన్స్ చేయడానికి చాలా స్కోప్ ఇస్తుంది. ఈ సినిమాకి ప్రాణం పోసినందుకు నేను థ్రిల్ అయ్యాను' అన్నారు డైరెక్టర్ సెల్వమణి సెల్వరాజ్ మాట్లాడుతూ"ఇటువంటి ప్రతిభావంతులైన నిర్మాతలు, క్రియేటివ్ టీంతో  కలిసి పనిచేయడం ఆనందంగా వుంది.